
చరిత్ర
చోరులు
— భరణి

**పదిహేను** రోజుల క్రితం ఒక అర్ధరాత్రి.

అక్రమంగా, అన్యాయంగా, అమానుషంగా ఒక 'చలనం' జరిగింది చరిత్రలో.

చలించరానిది, చలించింది గనక చాలా సంచలనం చెలరేగింది.

కదపకూడని దాన్ని కదిపారు గనక, గొప్ప కదలిక మొదలైంది. దేశంలో, కాలంలో, ఎన్నో హృదయాల్లో, మరెన్నో ఆలోచనల్లో.

కంటికి కనిపించని ఈ తుపాను తాకిడికి అల్లల్లాడి పోతున్నాయి చరిత్ర పుటలు—ఈ పదిహేను రోజులుగా.

"కళా సరస్వతి కళంకితమై పోయింది" అని కేవ్‌లోని కళాకారుడు కన్నీటితో క్రక్కదిలి పోతున్నాడు.

"మానవుడు తాను కూర్చున్న చెట్టుకొమ్మని తానే నరుక్కుంటున్నాడు. తన గతాన్ని తన చేతులతో తానే ధ్వంసం చేసుకుంటూ, తన భవిష్యత్ గృహంలోని దీపాన్ని తానే ఆర్పుకుంటున్నాడు" అంటూ చరిత్ర అశరీర వాణితో అరుస్తోంది.

పదిహేను రోజులుగా చెన్నకేశవస్వామి తన సొంత నెలవు విడిచి, కోర్టువారి కొలువులో రక్షణ పొందుతున్నాడు. ఈ పదిహేను రోజులుగా చెన్నకేశవస్వామికి నివాళి లేదు. నీరాజనం లేదు. నైవేద్యం లేదు. నిత్యస్నానం లేదు. నిరంతర భోగం లేదు. చరిత్రకి తెలిసినంతవరకూ చెన్నకేశవస్వామికి ఈ దురవస్థ ఎప్పుడూ లేదు.

నిశ్చలమైన ధ్యాన ముద్రలో కూర్చుని, నిరంతర భక్తివాహినిలో కదలి పోతున్నారు తిరుమలాచార్యులుగారు.

బెయిల్ మీద విడుదలైన చిన్న దొరకి, ఈ పదిహేను రోజులుగా అప్పుడప్పుడు కోర్టుకి వెళ్ళి రావడం వినా, నిత్యకృత్యంలో పెద్ద డిస్టర్బెన్స్ లేదు.

లాయర్ సూర్యారావు ఈ పదిహేను రోజుల నుంచీ ప్రతి రోజూ స్నానానికి బదులు ఈ కేసునే తలకి పట్టించుకుంటున్నాడు.

కాటంరాజుగారు ఈ ట్రిపుల్ హెడేక్‌ని సూర్యారావుకి పంపిణీ చేసి తన కార్యక్రమాల్లో మునిగి పోయారు నిశ్చింతగా.

ఈ విధంగా ఇంత మందిని ఇన్నాళ్ళుగా 'మూవ్' చేస్తున్న ఈ తుపాను తాకిడికి ఒక గడ్డిపరకకూడా అటూ ఇటూ కదులుతోంది — కోర్టు నుంచి రిమాండ్‌కీ, రిమాండ్ నుంచి కోర్టుకీ. ఆ గడ్డిపరక పేరు పైడికొండ. తాము కూలిపోకుండా బాలన్స్ సరిచూసుకోవడంతో లీనమై ఉన్న మహావృక్షాలు ఈ తృణ చలనాన్ని పట్టించుకోక పోవడం సహజమే!

కాని ఎప్పుడూ భగవంతుడి పాదపద్మాల మీద మాత్రమే దృష్టి కేంద్రీకరించుకుని, వినయంతో శిరస్సు వంచుకుని, క్రిందికి మాత్రమే చూసే తిరుమలాచార్యుల వారి కొక్కరికి మాత్రం ఈ 'తృణ చలనం' కంటబడింది.

• • • •

అది ప్రాచీనమైన ఆ చెన్నకేశవస్వామి దేవాలయం ప్రసిద్ధిచెందిన కళా నివాసం. విశాలమైన ప్రాంగణం. ఎన్నెన్నో మంటపాలు, ప్రాకారాలు. ప్రతి అంగుళం పరమాద్భుతమైన శిల్పకళావైభవంతో విరాజిల్లుతూ ఉంటుంది.

నాట్యాన్ని స్థిరీకరించిన ఆ శిల్పాలు చూపరుల హృదయాన్ని నర్తింప జేస్తాయి!

అక్కడి అణువణువునా ఉప్పొంగి పొర్లుతోన్న కళారుచి, సందర్శనార్థం వచ్చిన వారిని నిశ్చలం చేస్తుంది! శిల్పాలుగా మార్చి నిలబెట్టేస్తుంది.

అక్కడ కదలాడిన ఋషి మానవుడి కలలన్నిటినీ శిలల్లో కట్టి అట్టే పెట్టింది.

కరిగిపోని, కదిలిపోని ఈ స్వప్న స్వర్గం—ఈ స్వర్గస్వప్నం—ఏ నాటిది? ఈ ప్రశ్నకు జవాబు చెప్పాలని చరిత్ర గింజుకుంటోంది. శాతవాహనులనీ, చోళులనీ, పల్లవులనీ, కాకతీయులనీ, వీరందరికీ పూర్వులైన ఇంకెవ్వరో అనీ ఈ సృష్టి కర్తృత్వాన్ని ఎవరో ఒకరికి ఆపాదించాలనీ ఆరాటపడుతోంది.

అచలము, అజరము, అమరము అపూర్వము అయిన ఈ దృశ్య సాక్షాత్కారంతో సంతృప్తి పడక, ఆ దృశ్య కావ్య రచన చేసిన మర్త్యుల పూర్వ స్మృతి కోసం అశాంతితో అల్లల్లాడిపోతోంది చరిత్ర. మట్టిని తవ్వి తీస్తోంది. కాలగత కంకాళరాసుల్లోకి గుచ్చి గుచ్చి చూస్తోంది. వర్తమానపు స్థిరత్వం లోంచి దృష్టి మళ్ళించి, గతించిన మరుభూముల అయోమయంలో తారాట్లాడుతోంది!

• • • •

అవిచ్ఛిన్నంగా కొనసాగుతోన్న ఈ కళా సామ్రాజ్యం మీదికి దండయాత్ర జరిగింది.

ఆ మధ్య సీమనుంచి వో దొరగారు దిగారు. ఆయన పెద్ద కళాపిపాసి. ఇక్కడి కళాకాంతను వరించారు. చెన్నకేశవస్వామి ఆలయాన్ని సందర్శించి వచ్చి, కాటంరాజుగారితో కాంట్రాక్టు కుదుర్చుకుని వెళ్ళారు.

కాటంరాజుగారు బిల్డింగ్స్ కాంట్రాక్టరు. ఏదైనా కట్టడంయొక్క, నిర్మాణంగాని, నిర్మూలనంగాని ఆయనతో ఎదుటి పార్టీ చేసుకునే ఒప్పందం బట్టీ ఉంటుంది.

తన పూర్వపు కాంట్రాక్టర్లెవరో కట్టిపడేసిన కళాకాంతను, తాను విడిపించి తెచ్చి, కన్యాదాతగా వ్యవహరించి,సీమ దొరగారికి కట్టబెట్టి మెట్టినింటికి సాగనంపాలి. ఆ మేరకు ఒప్పందం కుదుర్చుకుని కాటంరాజుగారు కార్యనిర్వహణకు, కుడిభుజం చిన్న దొరకి కబురు పెట్టారు.

"మన వాళ్ళకి గొప్ప కళని సృష్టించడం తెలుసు గాని, గౌరవించడం తెలియదహ్హా! ఇంత గొప్ప చెన్నకేశవస్వామి విగ్రహాన్ని అలా చీకట్లో చిన్నకొట్లో పెట్టి, దీపం ధూపంఅంటూ పొగపెట్టి, పాలూ, నీళ్ళూ, పూలూ, పాపాలూ నెత్తిన గుమ్మరించి పాడుచేస్తున్నారు. కళ్ళారా కళను చూసి 'ఔరా' అని ఆనందించడం మాని, భక్తి పేరుతో కళ్ళని గట్టిగా మూసేసుకుంటారేమిటి? అబ్బెబ్బే! బాగులేదు! ఈ కళా ఖండాల్ని సరైన సౌందర్యారాధకుడి కొలువులో అలంకరించాలి. ఆ ఏర్పాటు చెయ్యి!

"అన్నట్టు చెన్నకేశవస్వామిని ఒంటరిగా పంపడం ఎందుకూ? వీణలు వాయిస్తూ, వేణువు లూదుతూ నాట్యం చేస్తూ ఈ మారు మూల గోడల కంటుకు పోయిన కళాకారుల్ని కూడా ఆయనతో పంపు. దారిలో కాలక్షేపంగా ఉంటుంది.

ఆయన వెళ్ళేది పశ్చిమ దేశాలకు కదా! అక్కడ మళ్ళీ ఆయనకి మన చెట్లూ, లతలూ, పూలూ, పళ్ళూ, పిట్టలూ, జంతువులూ కనిపిస్తాయో కనిపించవో! ఎలాగా మనవాళ్ళు అవన్నీ స్తంభాల మీద చెక్కి అట్టే పెట్టారు కదా! పోర్టబుల్‌గా మార్చగలవేమో చూడు."

• • •

చిన్నదొర కార్యాచరణకి పూనుకున్నాడు. మొట్టమొదట కావలసింది కార్మికులు! పైడికొండ దగ్గరకు వెళ్ళాడు.

గుండెనీ, మెదడునీ కూడా కండలుగానే మార్చి సృష్టించాడు పైడికొండని, భగవంతుడు!

పైడికొండకి రెండే ఉన్నాయి—కడుపూ, కండలూ. ఇంట్లో పెళ్ళాం పిల్లల కడుపులుకూడా అతని కండల్నే తింటూ ఉంటాయి. కండల్ని తిండిగా మార్చగల ఏ పనైనా చేస్తాడు పైడికొండ. అతనికి విచక్షణ అనేది తను పొందే కిరాయి మీద ఆధారపడి ఉంటుంది.

కోతల సమయంలో పంటలు కోసి కుప్పలు వేసే కూలిపని చేస్తాడు. ఊడ్పుల సమయంలో నారు పోసి, నీరు పోసే కూలిపని చేస్తాడు. కలుపు తీసేందుకు, కంచె వేసేందుకు పనికొస్తాడు.

కుప్పల యజమానుల కక్షలకోసం మార్చిన కుప్పల్ని తగలబెట్టే 'కూలిపని' కూడా చేస్తాడు.

## వేషం గుర్తు

పరీక్ష ఇంటర్వ్యూకు హాజరైన ఉస్మానియా వైద్య విద్యార్థుల్ని హిప్పీలను గురించి ప్రశ్నలడగడం సబబేనా అని మన శాసనసభలో విమర్శించడం జరిగింది. సబబైనా, కాకపోయినా ముందు ముందు ఇటువంటి పృచ్ఛకులను సంతృప్తి పరచడానికి ఈ సమాచారం ఉపయోగపడవచ్చు.

వచ్చినవారిని వచ్చినట్లుగానే థాయ్‌లాండ్‌లో ప్రవేశించకుండా వెనక్కు పంపించివేయడానికని హిప్పీల నెలా గుర్తించాలో బాంగ్‌కాక్ విమానాశ్రయంలో ప్రకటించిన వివరాలివి :

(1) లోన బనియనుగానీ, అండర్‌వేర్ గానీ ధరించక కేవలం వెస్ట్‌కట్, సింగ్‌లెట్ మాత్రమే ధరించెడివారు.


(2) తొడల మీదికి కూడా దిగీ దిగని అతి పొట్టి నిక్కర్లు తొడిగినవారు.

(3) ఏ జాతీయ యూనిఫారమ్‌లోనో భాగమయ్యుంటే తప్పితే, వేసుకున్న వస్త్రాలకూ, కాలికి తొడిగిన పాంకోళ్ళ స్లిప్పర్లకూ పొంతన లేకుండా కన్పించేవారు.

(4) ఎడ్డిమడ్డిగా అగౌరవంగా కన్పించే సెల్కు పాంట్లు ధరించెడివారు.

(5) రోత పుట్టించేట్లు పెరిగిన మురికి కేశాలను విరబోసుకు తిరిగేవారు.

—ప్రనీల్




తన చేతులతో నారు పోసి, నీరు పోసి, కలుపు తీసి, కంచె వేసి, పెంచి పెద్దజేసి పండించిన పంటను తన చేతులతోనే చితిలో వెయ్యడానికి వెనకాడడు పైడికొండ. కిరాయిలో మాత్రం నిర్మాణానికీ, విధ్వంసానికీ తేడా చూపిస్తాడు.

అతని చెమట పగటి తాపంలో తక్కువ కిరాయికీ, చీకటి పాపంలో ఎక్కువ కిరాయికీ స్రవిస్తుంది. ఇలా ఎక్కువగా పుచ్చుకుని, చట్టానికీ, న్యాయానికీ ఋణపడిపోతే, అడపాదడపా కటకటాల వెనకాల శ్రమించి, ఋణ విముక్తుడు అవుతూ ఉంటాడు.

కాటంరాజుగారు తన కాంట్రాక్టులకోసం ప్రత్యేకంగా ఒక కూలీల దళాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అందులో పైడికొండ ఒకడు.

చిన్నదొర పైడికొండని వెతుక్కుంటూ వచ్చే సమయానికి పైడికొండ మేస్త్రీ పర్యవేక్షణలో చెమటలు కక్కుతూ పగటి పని చేస్తున్నాడు. ఏదో భవన నిర్మాణం జరుగుతోంది. కడుతోన్న గోడకోసం ఇటుకలు మోస్తున్నాడు పైడికొండ. నిర్మాణం అందంగానూ, తీరిగ్గానూ జరుగుతోంది!

చిన్నదొర పైడికొండతో మంతనా లాడాడు. మరో ఇద్దరు— కోటిరెడ్డి, గంగులు దొరికారు— చాలు.

మరునాడు రాత్రి పైడికొండ దేవాలయపు గోడల నుంచి రాళ్ళను పెకలిస్తున్నాడు — ప్రతి మల్ని సాధ్యమైనంత సాకారంగా విడగొట్టడానికి. చీకటి లాంటి చిన్న దొర పర్యవేక్షిస్తున్నాడు. నిర్మూలనం శీఘ్రంగానూ, వికృతంగానూ ముగిసింది.

వాహనం సిద్ధమైంది. కోటిరెడ్డి పనైంది. కిరాయి పుచ్చుకుని వెళ్ళిపోయాడు. గంగులు డ్రైవ్ చేస్తున్నాడు. పైడికొండ చెన్నకేశవ స్వామికీ, ఆయన పరివారానికీ కంపెనీ ఇస్తున్నాడు.

మార్గమధ్యంలో —

దొరగారిదాకా కళాకాంతని సాగనంపాల్సిన పైడికొండ రూటు మార్చి తన అత్తారింటికీ, చట్టవిరుద్ధమైన గౌరవాన్ని పొందడానికి పోతోన్న చెన్నకేశవుడు చట్టబద్ధమైన అగౌరవంలోకీ, అసౌకర్యం లోకీ తరలిపోయారు.

గంగులు కొంతకాలంపాటు పరారీ మంత్రం సాధన చెయ్యడానికి అడవుల్లోకి వెళ్ళాడు.

కంచికి చేరాల్సిన కథ, 'కంచె' కాపు కాసి అడ్డుకోవడం వల్ల ఇంటికి తిరిగి వచ్చేసింది! !

● ●

కేశవ్ తన గదిలో కూర్చుని చకచకా రాసుకుపోతున్నాడు తన వ్యాసాన్ని — 'పర్వతాగ్రం నుంచి పాతాళపు లోతుల్లోకి' అనే శీర్షిక క్రింద—

"ఇన్ని దోపిడీలు, ఇన్ని దురంతాలు, ఇంత అశాంతి, ఇంత అభద్రత ... మనిషికి వర్తమానం ఇంత పీడ కలలా పరిణమించిం దేమిటి? ఇందుకేనా మనిషి ప్రకృతి నుంచి వేరుపడిపోయాడు? సమాజంగా ఏర్పడి, నాగరకునిగా ఎదిగింది ఇలాంటి వర్తమానంలోకి ప్రయాణించడానికేనా?

ఆహారం సమస్య! నిద్ర సమస్య! భయం సమస్య! మైథునం మహా సమస్య!!

ఇంక, ప్రకృతి నుంచి వేరుపడి మనిషి సాధించిందేమిటి, జీవితాన్ని సమస్యగా తీర్చుకోవడం తప్ప?"

రాస్తూ రాస్తూ అలిసిపోయి అలాగే నిద్రపోయాడు. ఉషోదయంతో లేచి, దేవాలయం వైపు వెళ్ళాడు.

అతని జీవితమంతా ఆ దేవాలయం ప్రాంగణంలో నిర్మించబడినది. ఆ కోనేటి నీరు తన నెత్తురుగా, ఆ చెట్ల చిరుగాలులు తన వూపిరిగా పెరిగాడు కేశవ్.

అక్కడి చిరుగంటల సవ్వడి అతని గళంలో లయం గిస్తూ అతణ్ణి గాయకుణ్ణి చేసింది.

ఆ శిల్పాలు అతనిలోని కవిని చెక్కిన శిల్పులు! అక్కడి కళాకాంత అతనిలోని కళాకారుణ్ణి కన్నది! ఆ ప్రాకారాల్లోని ప్రతిమల పాదాలు నిరంతరం అతని హృదయ వేదిక మీద నర్తిస్తూ ఉంటాయి.

ఆ రోజు అక్కడ అతను చూసిన దృశ్యం...

కటిన రంగింగా మారిన కళా దర్బారు! కుత్తుక ఉత్తరించబడ్డ కళా సరస్వతి కళేబరం కనిపించింది! నిన్నటి నిశిలో అక్కడ నర్తించిన పిశాచాల వికట హాసపు వికృత స్మృతి!

కుసుమ కోమలమైన శిలా కన్నియ పాదాలు నర్తించే ఆ ప్రాంగణంలో రక్షక భటుల కాళ్ళు కవాతు చేస్తున్నాయి! చిరు గజ్జెల ఘలంఘలలో మృదంగించిన మంటపాలు ఇనుప నాడాల తోలు బూట్ల ఘట్టనల్లో ప్రతిధ్వనిస్తున్నాయి! వేణువులు వినిపించే కచేరీలో పోలీస్ విజిల్స్ అరుస్తున్నాయి!

కొన్ని స్తంభాల్ని పెరికేశారు! కొందరు కళాకారుల చేతుల్ని వీణలు వేణువులతో సహా నరికేశారు! కొన్ని తమాలతల్ని తెంపేశారు! కొన్ని లతల తనువుల్ని కోసేశారు! మొత్తం అన్ని ప్రతిమల్నీ చెరిచారు!

అవి రాళ్ళేగా? అక్కడ రక్తం స్రవించదుగా?

ఈ ప్రశ్నల్ని మరుభూమిలా మిగిలిన ఆ ప్రాంగణాన్ని కాదు అడగవలసింది— కేశవ్ లాంటి కళాకారుల గుండెల్ని అడగాలి. ఎందుకంటే, రాతి మీద మూర్తిని మాత్రమే చెక్కిన ఉలి, ఆ మూర్తి ప్రాణాల్ని కళాకారుల హృదయాల్లో నిక్షిప్తం చేసింది!

● ● ● ●

"ఎలా జరిగింది?"

ఈ ప్రశ్న ఎవ్వర్నీ వేయడు కేశవ్—జవాబు ఎదురుగా కనిపిస్తోంది గనుక.

"ఎవరు చేయించా రిది?"

ఈ ప్రశ్న వెయ్యడు కేశవ్. స్మగ్లర్స్! ఈ 'జాతి నామం' ఆ ప్రశ్నకి జవాబని అతనికి తెలుసు. ఈ ఇంటి పేరు గల వారి వంశం ఇటీవల విస్తరిస్తోంది. వ్యక్తి నామస్మరణ మర్నాడు వార్తాపత్రిక జపించింది. స్మగ్లర్ కాటంరాజు! స్మగ్లర్ చిన్నదొర!

చరిత్ర ఈ రెండు పేర్లనీ నోట్ చేసుకుంది!

"ఎవరు చేశా రిది?"

ఈ ప్రశ్న అసలు కేశవ్ ఆలోచనల్లోకే రాదు. ఆ ప్రశ్నకి జవాబుగా చెప్పుకోవలసిన వారి వంశనామం ఈ దేశమంత పెద్దది. ఈ దేశమంత పేదది కూడా! 'కిరాయి' అనేది వారి వంశనామం. చరిత్ర కిరాయి వారి పేరు రాసుకోలేదు! కాటంరాజు, చిన్నదొరల పేర్లు మాత్రమే రాసుకుంది.

● ● ● ●

కేశవ్ తిరుమలాచార్యుల వారింటివైపు బయలుదేరాడు. గాయపడ్డ అతని హృదయానికి సానుభూతి కావాలి. అతని దుఃఖాన్ని పంచుకోగలిగేది ఆచార్యుల వారొక్కరే. అర్చకులుగా ఆ ఆలయాన్ని అంటిపెట్టుకుని, ఆయన గర్భగుడిలో చెన్నకేశవస్వామికి జీవితాన్ని అర్పించుకున్నారు. కేశవ్ కళారాధనతోను, ఆచార్యులవారు భక్తిపారవశ్యంతోను సేవించారు ఆ ఆలయాన్ని. ఆ విధంగా వారిద్దరూ సహోదరులు. ఇద్దరికీ ఒకే దెబ్బ! ఇద్దరిదీ ఒకే బాధ!

తిరుమలాచార్యుల వారిని చూసి కొంత ఆశ్చర్యపోయాడు కేశవ్. ఆయనలో ఉండవలసినంత దుఃఖం ఉన్నట్లుగా తోచలే దతనికి. నిర్లిప్తంగా ఉన్నారు.

ఇద్దరి మధ్యా చాలా సేపు మౌనం. ఆ తరవాత కేశవ్ తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు.

ఆయన నవ్వి అన్నారు: "ఏ ఆలయానికైనా స్థల మాహాత్మ్యం కొంత కాలం వరకూ పరిమితమై ఉంటుంది. దైవాన్ని ప్రతిష్ఠాపించేముందు శ్రీచక్రం, యంత్రం స్థాపిస్తారు. వాటితో ఆ ఆలయ ప్రాశస్త్యపు కాలపరిమితి నిర్దేశించబడి ఉంటుంది. నా చెన్నకేశవుడికి ఇక ఇక్కడకొలువు ఉండవలసిన అవసరం లేదు. ఈ స్థలానికి ఆయన్ని నిలుపుకో'గలిగిన

మాహాత్మ్యం చెల్లిపోయి ఉంటుంది. ఆయన అవతారం చాలించి వెళ్ళిన వెనకనే నరులు ఆ విగ్రహాన్ని తాకగలిగి ఉంటారు. ఒట్టి రాతి విగ్రహాన్ని కదపటంలో కష్టమేముంది? నా స్వామి ఇంకా ఇక్కడే ఉండ నిశ్చయించుకుంటే, నరులు తేరి చూడగలరా? ఈ పాటికి మరో పవిత్రమైన స్థలంలో వెలిసే ఉంటాడు. అదీగాక..." ఆయన తన నమ్మకాన్ని ఇంకా వివరిస్తూ ఉండగా కేశవ్ మధ్యలో అందుకున్నాడు.

"చెన్నకేశవస్వామి ఒక్కటే సమస్యా ఇక్కడ? భక్తి పట్ల తప్ప మరో వైపు మీ దృష్టి మళ్ళదా? ఈ సంఘటనలో దుఃఖించవలసిన, ఆలోచించవలసిన సమస్య మరేదీ లేదా?" ఆవేదనతో అడిగాడు.

"లేకేం? చాలా ముఖ్యమైనదీ, ప్రాథమికమైనదీ అయిన సమస్య ఉన్నది. అదేమిటో నేను తరవాత చెబుతాను. ముందు నీ ఆవేదన దేని కోసమో స్పష్టం చెయ్యి. ఆగు! కళాకారుడుగా నీ హృదయానికి తగిలిన గాయాన్ని నేను అర్థం చేసుకో గలను. కాని, కళాకారుడుగా కాక ఒక మామూలు మనిషిగా ఆలోచిస్తూ, ఈ సంఘటనలో కళావిధ్వంసం తప్ప మరేదైనా సమస్య ఉన్నదేమో చెప్పు?"

"ఎందుకు లేదు? చాలా భయంకరమైన సమస్య. మానవుడి చరిత్రకీ, భవితవ్యానికీ ఆధారభూతమైన గతం నాశనమైంది. ఈ దేవాలయం భక్తికీ, కళకీ మాత్రమే ప్రతినిధి కాదు. మానవుడి జీవితానికీ, జీవనానికీ గతం నుంచి భవితవ్యం దాకా సాక్షిభూతంగా నిలిచే చరిత్ర ఇది!" చాలా ఆవేశంగా అన్నాడు కేశవ్.

"అసలు చరిత్ర ఎందుకు, కేశవ్?" చాలా ప్రశాంతంగా అడిగా రీ ప్రశ్నని తిరుమలాచార్యులు గారు. చకితుడైన కేశవ్ అయోమయంగా "అంటే?" అన్నాడు.


"అంటే గతానికి దర్పణమైన చరిత్ర ఎందుకూ అని అంటే, గతం ఎవరికి, ఎందుకు, ఏం అవసరం అని?"

"మీ రీ ప్రశ్నని ఎలా వెయ్యగలుగుతున్నారో, ఎందుకు వేస్తున్నారో అర్థం కావడం లేదు. మనిషికి గతం అక్కర్లేదా? గతం దాటి రియ్యకపోతే మనిషి వర్తమానం లోకి ఎలా వచ్చాడు? గతం, స్మృతి, చరిత్ర అక్కర్లేకపోతే, మనిషి భవిష్యత్తుని ఏ పునాది మీద నిలబెడతాడు?" ఆవేశంతో పూగిపోతూ అరిచాడు కేశవ్.

"కేశవ్! మనిషి, మనిషి అని నువ్వు పదే పదే వల్లిస్తూన్న మనిషి వేరు, నిజమైన మనుషులు వేరు. నువ్వూ, నీ చరిత్రా ఆరాటపడేది నిజమైన మనుషుల గురించి కాదు. మనుషులుగానే పుట్టినా, మనుషులుగా మిగలని మరెవ్వరి గురించో. చరిత్ర ఆ మరెవ్వరికో సంబంధించింది. నిజమైన మనుషులకి చరిత్రే లేదు. వాళ్ళకి గతమూ లేదు, ఆగతమూ లేదు."

"స్పష్టంగా చెప్పండి!" ఉక్రోషంగా అన్నాడు కేశవ్.

"ఇందాకా అన్నానే ఈ సంఘటనలో దుఃఖించవలసిన ప్రాథమిక సమస్య ఉన్నది అని? ఆ సమస్య




చరిత్ర విధ్వంసం కావటం కాదు. కోటిరెడ్డి, గంగులు, పైడికొండ లాంటి మనుషులకి చరిత్రలో ఉనికి లేకపోవడం."

"ఏళ్ళెవళ్ళు?"

"చూశావా, ఎవళ్ళు అసలు సమస్యకి ఆధారభూతమో, ఎవళ్ళగురించి మానవుడూ, మానవత్వమూ ఆలోచించాలో వాళ్ళసలు నీ ఆలోచనా పరిధిలోనే లేరు. నువ్వే కాదు, నీ చరిత్రా అంతే! నేల విడిచిన సాము చేస్తూంది. వీళ్ళు మనుషులు. వీళ్ళే మనుషులంటే! ఈ వినాశనానికి ప్రత్యక్ష కారకులు వీళ్ళు."

"మరి కాటంరాజూ..."

"వాళ్ళు చేయించిన వాళ్ళు. స్మగ్లర్స్! వాళ్ళు మనుషులు కాదు. కాని, చరిత్ర వాళ్ళ పేర్లు రాసుకుంది. అసలు 'మనుషుల్ని' వదిలేసింది."

"కాని, మీ 'మనుషుల' కేం ప్రమాదం లేదుగా ఇప్పుడు? కోర్టు స్మగ్లర్లని శిక్షిస్తుంది కాని, ఈ కిరాయి వాళ్ళని కాదుగా! ఒకవేళ శిక్షించినా ఏ ఒకటి రెండు నెలలు సామాన్యమైన శిక్ష వేసి వదిలేస్తారుగా?" వ్యంగ్యంగా అన్నాడు కేశవ్.

"కేశవ్! ఈ శిల్పాల్ని ఇలా తరలించడం వల్ల లక్షల లెక్కలో లబ్ధి పొందేది మరెవరైనా, స్వయంగా ఈ పని చేసినవాడు కేవలం 'కూలి' కోసం చేశాడు. తన స్వహస్తాలతో ఈ శిల్పాల్ని కూలగొడుతున్నప్పుడు పైడికొండకి తను చేస్తూన్న 'పని' యొక్క గాంభీర్యమూ లోతూ తెలియవు.

అదే విధంగా ఈ ఆలయాన్ని నిర్మింప జెయ్యడం వల్ల అమూల్యమైన ఖ్యాతి పొందినది మరెవరైనా, స్వయంగా పని చేసిన వాడు కేవలం కూలి కోసం చేశాడు. అప్పుడు ఈ దేవాలయ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీకికూడా తను చేస్తూన్న పని యొక్క గాంభీర్యమూ, లోతూ, పరమార్థమూ తెలియవు.

అవసరార్థం కట్టడానికి రాళ్ళు మోశాడు వాడు.

అవసరార్థం కూలగొట్టడానికి రాళ్ళు తీశాడు వాడు.

ఆ అవసరం వర్తమానం! ఈ రెండు పనులూ వర్తమానపు దృష్టిలో ఒకటే!

సామాన్యుడికి గతం, ఆగతం ఉండవు. వాడెప్పుడూ వర్తమానంలోనే మలయిస్తాడు. వర్తమానం లోనే లయిస్తాడు. ఆదిమజాతి ఆటవిక యుగంలోనూ, ఆధునిక జాతి అణుయుగంలోనూ సామాన్యుడి స్థితి, గతి వర్తమానమే— ప్రకృతి లోని ఇతర జంతుజాలం లాగా.


చరిత్రలో సామాన్యుడికి స్థానం లేదు. చరిత్ర ప్రత్యేకంగా వేలెత్తి, పేరుపెట్టి చూపించేది మామూలు మనుషుల్నికాదు. అటు ఉన్నతులూ, ఇటు నీచులూ—అటు దేవతలు ఇటు రాక్షసులు అటు రాముడు, ఇటు రావణుడు. బలవంతులు ధన సంపన్నులు, గుణసంపన్నులు, మేధస్సంపన్నులు, అసాధారణ ప్రజ్ఞాపాటవాలు గలవారు, కళాకారులు, రాజులు, నేతలు, దాతలు . . . వీళ్ళ గురించి, ఇలా ప్రత్యేకమైన లక్షణాలు గలవారి గురించి, వీళ్ళ గతాను గతిక జీవనాన్ని గురించి చెబుతుంది చరిత్ర. వీళ్ళంతా సాధారణ, సామాన్య జనం కాదు గదా? మరి వీరి చరిత్ర జనం చరిత్ర ఎలా అవుతుంది?

ఇవాళ జరిగిన ఆ సంఘటనలో ఆ స్మగ్లర్లు అనే 'రాక్షసుల' పేర్లుగాక ఈ పైడికొండ, గంగులు అనే 'మనుషుల" వైపు చరిత్రదృష్టి కేంద్రీకరిస్తే?

ఒకసారి మానవుడికి తనదీ అంటూ ఒక చరిత్ర ఏర్పడితే, లటుపై లభివృద్ధి కోసమో, ఆదర్శం కోసమో అసాధారణుల చరిత్ర చదువుకోవచ్చు.

నీ సంగతి ఆలోచించు. కవివి, గాయకుడివి, గొప్ప కళాకారుడివి. వీటన్నిటికీ మించిన ఆలోచనా శీలివి అయిన నువ్వు—ఇవన్నీ కావడానికి ముందు ప్రాథమికంగా మనిషివి కదా? కాని నువ్వు ఈ సంఘటనవల్ల ఆ, నీ ప్రప్రథమ స్థితికి కలిగిన నష్టం పట్ల అక్కడున్న ఆకలి, అజ్ఞానం, అవిట్య పటుత్వం, అభద్రత, అస్థిరత లాంటి అంధకారం పట్ల కన్నా, నీ ఉన్నత ప్రమాణాలకు కలిగిన గ్లాని గురించి ఎక్కువ వ్యథ చెందుతున్నావు. అంటే నువ్వు నీ మానవత్వాన్ని ఎక్కడ వదిలేసినట్లు?

నిజానికి ఈనాడు ఈ నీ ఉన్నత విలువలు ఏవీ నశించిపోలేదే? ఈ దేశంలో కాకపోతే మరో దేశంలో అవి భద్రపరచబడ్డాయి! కానీ తన భవిష్యత్తుని మాత్రం నీ అలక్ష్యానికి బలి చేస్తూ అంధకారంలో అంతరించిపోతున్న గంగులు పర్త




మానం నిన్ను కలవరించదేం? వాడి గతం పట్ల, వాడి భవితవ్యం పట్ల నీ ఆవేదన ఏదీ?

జైల్లో నిశ్చింతగా కాలుమీద కాలు వేసుకుని పడుకుని, ఈ పని వల్ల తను చట్టానికి ఋణం తీర్చుకోగా, ఎంత కిట్టుబాటు అవుతుందో లెక్కలు కట్టుకుంటూన్న పైడికొండ.

తన స్థితి ఏమిటో, మానవుడుగా తన గతి ఏమిటో తనకు కావలసిందేమిటో, తను కోల్పోతున్నదేమిటో తెలుసుకోలేనంత అమాయకత్వంలో, అజ్ఞానంలో, అంధకారంలో ఉన్నాడే? నీకు వీడు కుట్టేసెల్లెనా అనిపించదా?''

తిరుమలాచార్యులు గారు ఇంకా చెప్పవలసినదేమైనా ఉంటే దాన్ని కేశవ్ ఆలోచనకు వదిలేస్తూ ముగించాడు. కేశవ్ ఆలోచిస్తూ లేచాడు. అతనికి తను రాస్తూన్న వ్యాసం 'పర్వతాగ్రం నుంచి పాతాళపు లోతుల్లోకి' గుర్తుకు వచ్చింది.

• • • •

పదిహేను రోజుల గతం పదహారోనాటి వర్తమానంలో తారాడుతూండగా తుఫాను అలిసిపోయింది. కాలక్షేపం కోసం పూళ్ళోని సినిమా హాళ్ళని ఆశ్రయించింది.

కేసుతో బుర్ర వేడెక్కిన లాయర్ సూర్యారావు ఏవో పార్టీ మొహమాటం మీద కాటంరాజుగారు, సరదా కోసం చిన్న దొర, కాస్సేపు తననీ, తన ఆలోచనల్నీ మరిచిపోవడానికి కేశవ్, వీళ్ళెవ్వరికీ తెలియని, అక్కరలేని, పైడికొండ భార్య మాలచ్చిమీ అందరూ వివిధ సినిమాహాళ్ళని ఆశ్రయించారు.

• • • •

''ఏటి, మాలచ్చిమీ! సినిమా కొచ్చినావా?'' ఎవరో మాలచ్చిమిని పలకరించారు.

''వూ' అంటే, పైడికొండని ఇంకా ఒగ్గిలేదా పోలీసోళ్ళు?'' ''ఏమో, ఎప్పుడొగ్గుతారో నాకేటి తెలుసు? అయినా అడికి ఇది ఇయ్యాల కొత్తేటి? మామూలే! ఒత్తే నాలుగైదు రోజుల్లోనో, కాపోతే నాలుగైదు నెలల్లోనో ఒత్తాడు!'' అంటూ నేలక్లాసుకో నిలబడింది మాలచ్చిమి.

సాయంత్రం అవుతూంది. అన్ని హాళ్ళలోనూ సినిమాలు ప్రారంభం అయ్యాయి. న్యూస్‌రీల్ వేస్తున్నారు. అన్ని హాళ్ళలోనూ అదే న్యూస్‌రీల్. ఆ న్యూస్‌రీల్‌ను చూస్తూనే — 'సొర్గాని కెళ్ళినా సవతిపోరు తప్పలేదు!' అని మాలచ్చిమీ, 'లైఫ్ ఈజ్ నథింగ్ బట్ ఐరానికల్ కోయిన్సిడెన్స్' అని తదితరులూ చెల్లించిన టికెట్టుకు అనుగుణమైన భాషలో ఉలిక్కిపడ్డారు.

ఫిల్మ్ డివిజన్‌వారు 'కళాచోరులు' అన్న పేరుతో తీసిన హ్రస్వ చిత్రం అది.

దేశంలోని మ్యూజియంల నుంచీ, దేవాలయాల నుంచీ శిలా విగ్రహాలూ, కళాఖండాలూ ఎలా మాయమవుతున్నాయో తెలియజేసే ఆ చిత్రాన్ని కాటంరాజుగారు చూస్తున్నారు ఆసక్తిగా—తనకు గురువుల వంటి బడా స్మగ్లర్ల కౌశలాన్ని గమనిస్తూ.

చిన్న దొర చూస్తున్నాడు—పట్టుకో గలిగినప్పుడు చట్టం ఏయే కారణాల వల్ల, ఏయే పద్ధతుల్లో పట్టుకుంటుందో పరిశీలిస్తూ.

లాయర్ సూర్యారావు కేసుని మననం చేసుకుంటూ చూస్తున్నాడు.

కేశవ్ చూస్తున్నాడు— మౌనంగా ధ్యానంతో.

మాలచ్చిమి విరగ్గా చూస్తూ పక్కనున్న వ్యక్తితో అంటూంది: ''ఇదేటమ్మిది! చచ! చెండాలం! అసలు బొమ్మ ఎంతకీ ఎయ్యడేటి? సంపేస్తున్నాడు ఎదవ రాళ్ళూ రప్పల తోటి!''

వ్యాఖ్యాత గంభీర కంఠంలో విషాదాన్ని ధ్వనింపజేస్తూ ముగింపు వాక్యాలు అన్నాడు!

''ఈ కళాచోరులు అమూల్యమైన కళాఖండాలనే కాదు, ఈ దేశ చరిత్రనే దొంగిలిస్తున్నారు! ఇదిలా కొనసాగితే కొన్నాళ్ళకి మనకి గతమే మిగలకుండా పోవచ్చు! మానవులంతా ఆలోచించవలసిన తరుణం ఇది! తన గతాన్ని కాపాడుకోవలసిన బాధ్యతని ప్రతి ఒక్కరూ గుర్తించాలి!''

న్యూస్‌రీల్ అయిపోయింది! కేశవ్ కళ్ళముందు లా సంతవరకట ఎరగని పైడికొండ కదిలాడు. అతను ఏదో అంటున్నట్టు అనిపిస్తూంది.

• • •

కేశవ్ రాసుకుపోతున్నాడు.

''చెన్నకేశవస్వామి మానవుడు కాదు—దేవుడు. ఆయనకు స్థానభ్రంశం కలిగినా చరిత్రే! పునః ప్రతిష్ఠ జరిగినా చరిత్రే! నిత్యభోగం కొనసాగినా చరిత్రే! వేరేచోట, ఏ విదేశాల్లోనో, ఏ మ్యూజియంలోనో, ఏ కళాప్రియుడి గాజు హృదయంలోనో కొలువు తీరినా చరిత్రే! ఆయన భవితవ్యానికి డోకా లేదు! ఎక్కడికి వెళ్ళినా తనతోబాటు తన గతాన్ని తీసుకువెళ్ళగలడు—అనాద్యుడు గనుక. ఎక్కడ ఉన్నా నిరంతర భవితవ్యం ఏర్పాటు చేసుకోగలడు—అనంతుడు గనక!!

కాటంరాజూ, చిన్నదొరా, సూర్యారావులు కూడా మామూలు మనుష్యులు కాదు. దేవుడు వాళ్ళ నొసటి మీద మనుష్యుల రాత రాసి పుట్టించినా, వాళ్ళు వేరే రంగురంగుల పచ్చ కాగితాల మీద తమ రాతలు రాసుకున్నారు! చెడుగానైనా చరిత్రలో వీరికి చోటు ఉంటుంది!

చెక్కిన శిల్పాలూ, చెక్కబడ్డ శిల్పాలూ కూడా మనుష్యులు కారు. కళ! కళాకారులు! కళా సరస్వతి! కనుక వీళ్ళ గతం గురించి, ఆగతం గురించి చరిత్ర పట్టించుకుంటూంది.

కాని చరిత్రకి కాగితాలై తమ మీద మరెవరి రాతలో రాయనిస్తూన్న మనుష్యుల కథో, చరిత్ర చేతిలో పెన్నుగా మారి, ఎవరెవరి గోత్ర నామాలో లిఖిస్తూన్న మనుష్యుల గురించిన రాతలో ఎదిగిన మనిషి వేదన దొంగిలిస్తూంది.

పర్వత శిఖరంగా పైకి లేచిన 'గొప్పతనం' తన మానవత్వాన్ని పాతాళంలో వదిలేస్తూంది!

ప్రస్తుతం బెంగ పెట్టుకోవలసింది గతం కోసం కాదు!

గతం తనకి అవసరమయ్యే స్థితికి. ఆగతంలోకి తను నడిచే తరుణం వచ్చే స్థితికి వర్తమానంలోని మానవుడు చేరుకునే దాకా— తన చరిత్రని నిరంతరం దోచేస్తూ, దాచేస్తూ తనని చరిత్ర హీనుడుగా మిగులుస్తూన్న దేవతల్ని, రాక్షసుల్ని, గొప్ప మంచివాళ్ళని, గొప్ప చెడ్డవాళ్ళని, సామ్రాజ్యాధినేతల్ని నిలదీసి 'నా మాటేమిటి?' అని సామాన్యుడు ప్రశ్నించగలిగేదాకా — వర్తమానమే మనిషికి కథా వస్తువు!!' *